క్లుప్తంగా

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పరవాడ: విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం మండల శాఖ అధ్యక్షుడు వి.వి.రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కోతలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ నాయకుడు పి.పి.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం పెందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల వాలిమెరక గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. అనంతరం పెందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి తగిన సలహాలు ఇవ్వాలన్నారు. ఐరన్ మాత్రలు, పోషకాహారంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎస్.రమారెడ్డి తదితరులు పాల్గొన్నా రు.

నాగుపాము హల్‌చల్



దండు కోనేరులో చాకచక్యంగా పట్టుకున్న నాగుపాము

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరం శివాలయం ఎదురుగా ఉన్న దండు కోనేరు చెరువు గర్భంలో ఓ నాగుపాము గురువారం హల్‌చల్ చేసింది. కోనేరును పార్కుగా అభివృద్ధి చేస్తుండగా గర్భాన్ని జేసీబీతో శుభ్రం చేస్తున్న సమయంలో రాళ్లగుట్ట నుంచి ఓ నాగుపాము బయటకు వచ్చింది. సర్పంచ్ దెడ్డం ప్రసాదరావుతో పాటు మరికొంత మంది పాలకవర్గ సభ్యులు వెంటనే స్నేక్ క్యాచర్ ఎస్.రామకృష్ణకు సమాచారం అందించారు. అప్పటికే రాళ్ల గుట్టలో ఉన్న నాగుపాముకు అక్కడ పనులు చేస్తున్న జేసీబీ తగిలి చిన్నపాటి గాయాలయ్యాయి. స్నేక్ క్యాచర్ రామకృష్ణ చాకచక్యంగా పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. ఆయనకు పంచాయతీ పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు



రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ, తదితరులు

సబ్బవరం: ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ఇప్పటికే అనేక సేవలను ప్రజల ముంగిటకే అందిస్తుండగా.. అదనంగా రిజిస్ట్రేషన్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చిందని తహసీల్దార్ బి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని గొల్లలపాలెం శివారు విప్పాక అగ్రహారంలో రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన సమగ్ర రీసర్వే పూర్తి కావడంతో గొల్లలపాలెం సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి కొనుగోలుదారులకు తహసీల్దార్ పత్రాలు అందజేశారు. సచివాలయం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మీనాయుడు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్ హరి, తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు కంటి వెలుగు

- వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా వృద్ధులకు నేత్ర పరీక్షలు
- జిల్లాలో 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తింపు
- 17,249 మందికి పంపిణీ



అంధత్వ నివారణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పథకం ఇప్పుడు మంచి ఫలితాలు ఇస్తోంది. కంటి చూపు సమస్యతో బాధ పడుతున్న ఎంతో మంది వృద్ధులకు వెలుగు ప్రసాదిస్తోంది.

మహారాణిపేట : డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తుంది. శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు, మందులు ఉచితంగా పంపిణీ చేస్తోంది.

వృద్ధులతో మొదలు

వృద్ధుల కంటి సమస్యలు మొదటి దశలోనే గుర్తించి చికిత్స చేస్తే సమస్య నుంచి బయటపడవచ్చు. ప్రత్యేక శిబిరాలు, ఆస్పత్రుల్లో కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తద్వారా కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 60 సంవత్సరాలు పైబడిన అవ్వాతాతలు 2,18,446 మంది ఉన్నట్టు గుర్తించారు. వీరిలో 1,33,622 మందికి వైద్య పరీక్షలు చేశారు. 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి, 17,249 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా కళ్లద్దాలు సిద్ధం చేశారు. లబ్ధిదారులు వచ్చి కళ్లద్దాలు తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. 7,776 మందికి కేటరాక్టు శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరిలో 3394 మందికి శస్త్ర చికిత్సలు చేశారు. పలు ప్రైవేటు ఆస్పత్రుల సహకారంతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు.



వృద్ధులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మూడు విడతల్లో వృద్ధులకు పరీక్షలు



మూడు విడతల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద వృద్ధులందరికీ కంటి పరీక్షలు పూర్తి చేశాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవ్వా–తాతలకు కళ్ల జోళ్లు ఇచ్చాం. కంటికి శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నాం. ఎన్‌జీవో సహకారంతో లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమం ఆగస్టు వరకు అమల్లో ఉంటుంది.

– డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేస్తున్నాం..



కంటి వెలుగు కార్యక్రమంలో అవ్వాతాతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, ఆస్పత్రికి వచ్చే వారికి కంటి వెలుగు కార్యక్రమం గురించి అవగాహన కల్పించడం చేస్తున్నాం. పరీక్షల అనంతరం అవసరం అయితే శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. అలాగే కేటరాక్టు ఆపరేషన్లు కూడా చేస్తున్నాం.

– డాక్టర్ విశ్వమిత్ర, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి

సింహగిరీశునికి స్వర్ణ సంపెంగ పుష్పార్చన



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు కనులపండువగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలో వేదికపై కొలువుదీర్చారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. విశేష హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

కనులపండువగా కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

క్విజ్ పోటీల విజేతలు వాడచీపురుపల్లి విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం కనకేశ్వరరావు

పరవాడ: ఆర్‌బీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో గురువారం నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి దూడ రఘు, 9 తరగతి విద్యార్థి రాజేష్ ప్రథమ స్థానంలో నిలిచి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రూ.5 వేల నగదు బహుమతిని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.కనకేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభాపాటవాలతో పాఠశాలకు, గ్రామానికి గౌరవం దక్కడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాత్రుడు, విక్టోరియా, రమేష్ బాబు, కూర్మారావు, అప్పలనాయుడు, సంజీవరావు, అన్నాజీరావు, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 120 పార్కుల అభివృద్ధి

- స్వచ్ఛ అనకాపల్లి సాకారానికి కృషి
- జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి



దండు కోనేరు పార్కులో కొబ్బరి మొక్క నాటుతున్న డీపీవో శిరీషరాణి తదితరులు

సబ్బవరం: అనకాపల్లి జిల్లాలో 644 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే 120 గ్రామ పంచాయతీల్లో బందలను, కోనేరులను పార్కులుగా అభివృద్ధి చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి తెలిపారు. మండల కేంద్రం సబ్బవరంలోని రూ.10 లక్షల పంచాయతీ నిధులతో దండు కోనేరును పార్కుగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన పనులను ఆమె కొబ్బరి మొక్కలను నాటి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ అనకాపల్లి లక్ష్యంగా సిబ్బంది పని చేస్తున్నారన్నారు. అదేవిధంగా అన్ని గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద గ్రామ కంఠాల భూములను సర్వే చేయిస్తున్నామని చెప్పారు. 1,721 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారన్నారు. సంపద తయారీ కేంద్రాల కో–ఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎంపీడీవో రమేష్ నాయుడు, ఈవోపీఆర్‌డీ మహేష్, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు, గ్రామ పెద్దలు కర్రి బాబు, పల్ల తాతారావు, బాదిరెడ్డి లక్ష్మణ, చిత్రాడ శ్రీను, సబ్బవరపు శివ, నానిబాబు, గెడ్డం కృష్ణ, పల్ల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆహార ఫలహారశాల ప్రారంభం



ఫలహారశాలను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాన్ని స్వీకరించాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచించారు. గురువారం ఉదయం బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌లో ఏర్పాటు చేసిన ఫలహార శాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సిరిధాన్యాలతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మానవ ఆరోగ్యానికి ఉపయుక్తంగా నిలిచే సిరిధాన్యాలను ఉపయోగిస్తూ విభిన్న ఆహార పదార్థాల తయారీ చేస్తూ, విక్రయించే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజల్లో ఆరోగ్యం, ఆహారంపై అవగాహన పెంపొందించడానికి ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, డాక్టర్ తుల సీరావు, వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి అవినాష్ సంస్థ నిర్వాహకులు ప్రజ్ఞానంద్, సాయిపద్మ, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సర్టిఫికెట్ల పరిశీలనకు నేడు గడువు

మద్దిలపాలెం : కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీకి చెందిన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ గడువు శుక్రవారంతో ముగియనుంది. విద్యార్థులు తమ సర్టిఫికెట్లను సాయంత్రం 5 గంటల్లోగా పరిశీలన చేయించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు సూచించారు.

సమష్టిగా మండలాభివృద్ధికి కృషి

- సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు
- పెందుర్తి ఎంపీపీ నాగమణి



సమావేశంలోమాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

సింహాచలం: అన్ని శాఖల అధికారులు సమష్టిగా మండలాభివృద్ధికి కృషి చేయాలని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి కోరారు. పెందుర్తి ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఏవిధమైన తీర్మానాలు ఈ సమావేశంలో లేకపోయినా ఎంపీపీ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల నుంచి అధికారులు హాజరుకావల్సింది ఉంది. కానీ కొన్ని శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ముఖ్యంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి అధికారులెవరూ హాజరు కాకపోవడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏయే శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాలేదో వారికి మెమోలు జారీ చేయాలని ఎంపీడీవోకు సూచించారు. అనంతరం హాజరైన పలు శాఖల అధికారులతో ఆయా పంచాయతీల్లో ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. గుర్రంపాలెం గ్రామంలో రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రం నిర్మాణాలు పూర్తయినా ప్రారంభించలేదని ఎంపీటీసీ సభ్యురాలు గంర్రెడ్డి మాలతి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వసంత, వైస్ ఎంపీపీ దాడి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



గంగునాయుడుపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ వరలక్ష్మి

పరవాడ: నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ వరలక్ష్మి గురువారం శ్రీకారం చుట్టారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నాయుడుపాలెం గ్రామ పంచాయతీలో ప్రజలకిచ్చిన హామీ మేరకు రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో గంగునాయుడుపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, వెంకటపతిపాలెం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.5 లక్షలు, హస్తినాపురం శివారు మండలవారిదొడ్డిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, దండినాయుడుగారి దొడ్డిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు చొప్పున ఖర్చు చేయనున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ కూండ్రపు కృష్ణం నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రం సమర్పణ



త్రినాథరావును అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియోఫిజిక్స్ విభాగం ఆచార్యుడు పి.త్రినాథరావు ఇండోనేషియాలోని జకార్తాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ప్రపంచ వ్యాప్తంగా 71 మంది పరిశోధన పత్రాలు సదస్సుకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా త్రినాథరావును ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తన కార్యాలయంలో అభినందించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

- అర్హులందరికీ న్యాయం చేసేందుకే 'గడప గడపకు..'
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- 79వ వార్డు దేశపాత్రుని పాలెంలో పర్యటన



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. వారి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 79వ వార్డు దేశపాత్రునిపాలెం గ్రామంలో గురువారం రాత్రి స్థానిక నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందని అర్హులకు న్యాయం చేసేందుకు గడప గడపకు వస్తున్నామని చెప్పారు. గ్రామంలో రహదారులు, కాలువలను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరారు. ప్రజల సమస్యలను గుర్తించి, తక్షణ పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న 'జగనన్న సురక్ష'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారం కోసం టీడీపీ నాయకులు వల్లిస్తున్న కట్టుకథలను నమ్మవద్దన్నారు. చంద్రబాబు ఎన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలిచి మళ్లీ సీఎంను చేసుకోవడానికి ప్రజలు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, పూర్ణానంద శర్మ, నాయకులు కర్రి వినోద్‌కుమార్, రవి, నందూరి రమణ, నరేష్, కల్యాణి, ప్రసాద్, నర్సింగ్, కిశోర్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

వర్సిటీని సందర్శించిన ఇరాక్ దేశస్తులు



ఇరాక్ దేశస్తులను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఇరాక్ దేశ విద్యా మంత్రిత్వ శాఖ ఇంగ్లిష్ లాంగ్వేజ్ కరికులం విభాగాధిపతి, ఏయూ పూర్వ విద్యార్థిని హింద్ ఫరూక్ ఆలీ గురువారం సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థిగా వర్సిటీలో అభివృద్ధి జరుగుతున్న తీరు తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున ఫరూక్ ఆలీని వీసీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: విశాఖపట్నం జిల్లాలోని నిరుద్యోగ యువతకు మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి ప్రధాన కార్యాలయంలో కార్పెంటర్ మరియు ఎలక్ట్రికల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు విశాఖ జిల్లా ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు డాక్టర్. వి.పద్మ గురువారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని, అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న యువతకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ద్వారా రుణఅవకాశం కల్పిస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 90596 65146, 80087 15357 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వసతి గృహాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు వినతి



డీడీ రామారావుకు వినతిపత్రం అందిస్తున్న విదసం ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు

ఎంవీపీ కాలనీ: ప్రభుత్వ బాలికల వసతిగృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విదసం ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు కోరారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్‌లో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని బాలికల వసతి గృహాల్లో మరింత భద్రత పెంచాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులకు అందించే సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. జిల్లాలో ఉన్న పలు సాంఘిక సంక్షేమ శాఖ స్థలాలకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విదసం ప్రతినిధులు హరిబాబు, సుజాత, నిర్మల, కస్తూరి వెంకటరావు, బల్ల కుమార్, సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి



కలెక్టర్ మల్లికార్జునకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలస్వామి తదితరులు

మహారాణిపేట : క్రిస్టియన్ శ్మశాన వాటికకు 10 ఎకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ విభాగం క్రిస్టియన్ ఎఫైర్స్ సలహాదారు డాక్టర్ ఎం.బాలస్వామి కలెక్టర్ మల్లికార్జునకు విజ్ఞప్తి చేశారు. గురువారం క్రైస్తవ సంఘాల నాయకులతో పాటు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. క్రైస్తవులు శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ క్రిస్టియన్ లీడర్స్ ఫోరమ్ చైర్మన్ ఆలీవర్‌రాయి, ఏఈఎల్‌సీ ప్రతినిధి రెవరెండ్ జేమ్స్ శ్రీకాంత్, విశాఖ సిమెట్రీ బోర్డ్ కార్యదర్శి జి. మాథ్యూపీటర్, బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ ప్రతినిధి పి. ఇమ్మానుయేల్ ఉన్నారు.